ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 30 జనవరి 2024





కృష్ణానదిలోని పాయల్లో మృతిచెందిన ఓ బాలుడి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)

జలగండం

కృష్ణానదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు

- సరదాగా దిగి సమాధి అవుతున్న యువకులు
- యనమలకుదురు ప్రాంతంలో అనధికార తవ్వకాలు

ఏడాదిలో 11 మంది జలసమాధి

2023, డిసెంబరు 16న దర్శిపేటకు చెందిన ఐదుగురు చిన్నారులు, 2023, మార్చి 3న ముగ్గురు స్నేహితులు.. ఈ ఆదివారం.. పటమటలోని హైస్కూల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు విద్యార్థులు.. ఏడాది కాలంలో మొత్తం 11 మందిని కృష్ణానదిలో ఉన్న గోతులు మింగేశాయి. నిండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. భవిష్యత్తు దీపాలను ఆర్పేశాయి. పెనమలూరు మండలం యనమలకుదురు నుంచి చోడవరంలో ఉన్న ఇసుక క్వారీ వరకు ఉన్న ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. సరదాగా ఈతకు దిగితే ప్రాణం బలి ఇచ్చుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అధికారులు మాత్రం రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదాలను అరికట్టే మార్గాలను అన్వేషించడం లేదు.

- 6లో..

మిల్లర్ల మాయాజాలం

ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఉమ్మడి జిల్లాలో మిల్లర్లు రైతులను నిలువునా ముంచేస్తున్నారు. మద్దతు ధర చెల్లింపులో మాయ చూపిస్తున్నారు. అధికారిక ఆన్‌లైన్ గణాంకాల ప్రకారం మద్దతు ధర చెల్లించినట్టుగా కనిపిస్తున్నా.. లోలోపల జరిగే వ్యవహారం మాత్రం వేరుగా ఉంటోంది. ఓవైపు కమీషన్ వ్యాపారుల పంట పండించడానికి మిల్లర్లు ప్రయత్నిస్తుంటే, మరోవైపు మిల్లర్లకు లాభాలు తెచ్చిపెట్టేందుకు కమీషన్ వ్యాపారులు కుట్రలు చేస్తుంటే, అంతిమంగా రైతులే నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



రెండు జిల్లాల్లోని రైతులకు చుక్కలు

- ధాన్యం బస్తా కొనాల్సింది రూ.1,630కు..
- కొంటున్నది మాత్రం రూ.1,300కే..
- రైతుల నుంచి రూ.330 అనధికారిక వసూలు
- లేదంటే ధాన్యం దిగుమతి చేసుకోరు
- కమీషన్ వ్యాపారులను ప్రోత్సహించేందుకే..
- దిక్కుతోచక కమీషన్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో ధాన్యం కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు సంబంధించి చూస్తే నిర్దేశిత కస్టమ్ మిల్లులకు అనుసంధానం చేసి ధాన్యం తరలించటానికి అనుమతులు ఇస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. ఒక్కసారి రైతులు ధాన్యం లోడును మిల్లులకు తీసుకెళ్లాక మరో రకంగా ఉంటోంది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మిల్లర్లు కొనడానికి ససేమిరా అంటున్నారు. దీనికోసం మిల్లర్ల సిండికేట్ కొత్త పద్ధతి అవలంబిస్తోంది. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవట్లేదు. దీంతో లారీలు, ట్రాక్టర్లపై ధాన్యం లోడు ఉండిపోతోంది. మిల్లర్లు ఇలా ఉద్దేశపూర్వకంగా చేయటం ద్వారా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసే ఎత్తుగడలో భాగమే మిల్లర్లు ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరిగి కమీషన్ వ్యాపారుల చేతుల్లోకి తీసుకొచ్చేందుకు కుట్ర చేస్తున్నారని తెలుస్తోంది.

మిల్లర్ల ప్లాన్ ఇదీ..

రైతులు తెచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవటానికి సిండికేట్ అయిన మిల్లర్లు కొత్త షరతు విధిస్తున్నారు. బస్తాకు రూ.1,300 మించి చెల్లించలేమని చెబుతున్నారు. రూ.1,630 లెక్కన రైతులకు చెల్లించాల్సి ఉంటుంది కాబట్టి, బస్తాకు రూ.330 ఎదురు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అలా చెల్లిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటామంటున్నారు. ఆర్‌బీకేలు ఏ మిల్లుకు సూచిస్తే, ఆ మిల్లర్లు ధాన్యాన్ని కచ్చితంగా దిగుమతి చేసుకోవాలి. కాకపోతే ఇక్కడ మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారు. దీనివల్ల రైతులు రవాణా చార్జీల రూపేణా నష్టపోవాల్సి వస్తోంది. పది చక్రాల లారీలో 100 బస్తాల ధాన్యం తీసుకెళ్లేందుకు రైతుకు రూ.10 వేల చొప్పున కిరాయి అవుతోంది. మిల్లర్లు ఆ లోడును తీసుకోకపోతే ఆ లారీ అక్కడే ఉండిపోవాల్సి వస్తోంది. మరో రోజు గడిస్తే లారీ కిరాయి రేటు పెరిగిపోతోంది. ప్రభుత్వం రవాణా చార్జీలను చెల్లిస్తామని చెబుతోంది. వాస్తవానికి టన్నుకు రూ.250 మాత్రమే రవాణా చార్జీలు ఇస్తున్నారు. అది కూడా మిల్లుకు తీసుకెళ్లే వరకే. వెయిటింగ్‌తో సంబంధం లేదు. ఇచ్చే చార్జీలే ఏ మూలకూ సరిపోవు. వెయిటింగ్ చార్జీలనేవి ప్రభుత్వం ఇవ్వదు. దీంతో వెయిటింగ్ వల్ల రైతులకు రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మిల్లుల దగ్గర లోడు దిగుమతి కాకుండా రోజుల తరబడి ఉండిపోతోంది. దీంతో రైతులు మిల్లర్లకు ఎదురు చెల్లించి ధాన్యాన్ని దించాల్సి వస్తోంది. ఇలా చేయటం ద్వారా రైతులు నష్టపోతున్నారు. రైతు భరోసా కేంద్రాల కంటే కూడా కమీషన్ వ్యాపారులకు అమ్ముకోవటమే మేలన్న భావనను మిల్లర్లు తెస్తున్నారు.

కమీషన్ వ్యాపారుల కాసుల కక్కుర్తి

కమీషన్ వ్యాపారులు బస్తా ధాన్యాన్ని రూ.1,300, రూ.1,400కు అనధికారికంగా రైతుల నుంచి కొంటున్నారు. మిల్లర్లకు పంపుతున్నారు. రైతుకు 11 రోజుల సమయం చెప్పి, ఆలోపు డబ్బు చెల్లిస్తున్నారు. కస్టమ్ మిల్లుల వ్యవహారంతో రైతులు కమీషన్ వ్యాపారులకు తెగనమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల కమీషన్ వ్యాపారులు మళ్లీ జూలు విదిలిస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో కమీషన్ వ్యాపారులు ఆర్‌బీకే కేంద్రాల్లోకి సైతం ప్రవేశించారు. ఉద్యోగులతో చేతులు కలుపుతున్నారు. ఆర్‌బీకేల నుంచి నేరుగా అనధికారికంగా రైతుల నుంచి ధాన్యం కొంటున్న ఉదంతాలు కూడా ఉంటున్నాయి. కమీషన్ వ్యాపారులు ప్రవేశిస్తేనే మిల్లర్లకు లాభాలు పండుతున్నాయి.

ఎన్నాళ్లకు..



18 నుంచి మల్లేశ్వరస్వామి దర్శనం ప్రారంభం

విజయవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న మల్లేశ్వరస్వామి దర్శనభాగ్యం ఫిబ్రవరి 18 నుంచి కల్పించనున్నారు. దీనికి సంబంధించి సోమవారం నగరంలోని జమ్మిదొడ్డిలో ఉన్న సమావేశ మందిరంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు ఈ వివరాలను వెల్లడించారు. మల్లేశ్వరస్వామి ఆలయాన్ని సీఎం జగన్ గత డిసెంబరు 7న ప్రారంభించారు. పనులు పూర్తికాకపోయినా ఆలయాన్ని ప్రారంభించిన అధికారులు దర్శనాలు మాత్రం కల్పించలేదు. ఫిబ్రవరి 18 నుంచి శివాలయంలో భక్తులకు దర్శనాలు కల్పిస్తామని వారు స్పష్టం చేశారు.

4న జనసేనలోకి ఎంపీ బాలశౌరి

భారీ ఏర్పాట్లు చేస్తున్న అభిమానులు

- పవన్ సమక్షంలో సభ్యత్వం తీసుకోనున్న ఎంపీ
- ఈసారీ మచిలీపట్నం ఎంపీగానే బరిలోకి..



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 4న మచిలీపట్నం ఎంపీ బాలశౌరి జనసేనలో చేరేందుకు అంతా సిద్ధమైంది. ఈ మేరకు ఆయన అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 4 సాయంత్రం 4.30 గంటలకు మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయన జనసేన ప్రాథమిక సభ్యత్వం తీసుకుని పార్టీలో చేరనున్నారు. జనవరి 13న బాలశౌరి వైసీపీకి రాజీనామా చేసిన విషయం విదితమే. వైసీపీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన బాలశౌరి పార్టీని వీడటం వైసీపీ శ్రేణులను షాక్‌కు గురి చేసింది. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నానితో విభేదాల కారణంగానే బాలశౌరి వైసీపీకి దూరమయ్యారు. ఎంపీ అన్న గౌరవం కూడా లేకుండా ఐదేళ్లపాటు నాని వ్యవహరించిన తీరుతో బాలశౌరి విసిగిపోయారు. ఈ విషయాన్ని పలుమార్లు వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో బాలశౌరి మనస్తాపానికి గురై పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన బాలశౌరి 2004లో తెనాలి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2009లో నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2013, అక్టోబరులో వైసీపీలో చేరారు. 2014లో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2019లో మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఈసారి ఆయన మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుంచి జనసేన తరఫున పోటీ చేస్తారని సమాచారం. ఐదేళ్ల కాలంలో మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ఎన్ని అవరోధాలు ఎదురైనా అధిగమించి అభివృద్ధి చూపించానని, ముఖ్యంగా మత్స్యకారులకు ఉపయోగపడేలా కేంద్రం నుంచి సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఘనత తనదని బాలశౌరి వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, అభివృద్ధి కోసం ఆయన పడుతున్న తపన తనను ఆకర్షించాయని, అందుకే జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు బాలశౌరి తెలిపారు.

లంచం తీసుకుని ముంచేశారు..!

రెవెన్యూలో అవినీతి పెచ్చుమీరుతోంది. భూమి వివరాలు రైతుల పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటే లక్షలాది రూపాయలు ముట్టజెప్పాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతటితో ఆగకుండా వేరే వ్యక్తుల వద్ద అధిక మొత్తంలో నగదు తీసుకుని మూడు, నాలుగు రోజుల వ్యవధిలోనే ఆన్‌లైన్‌లో పేర్లు మార్చేస్తున్నారు. ఈ తరహా ఘటనకు సంబంధించి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో బాధిత రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

గన్నవరం తహసీల్దార్, ఆర్ఐపై స్పందనలో ఫిర్యాదు

- రూ.7 లక్షలు ఇచ్చాం.. అడంగల్‌లో మా పేర్లు మార్చేశారు
- డబ్బు పోయింది.. భూమి కూడా పోయింది..
- ఇప్పుడు తెల్ల కాగితంపై సంతకం చేయమని ఒత్తిడి
- న్యాయం చేయండంటూ కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు



కలెక్టరేట్‌లో తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధిత రైతులు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : గన్నవరం మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన టి.కోటేశ్వరరావు, అతని కుమారులు మద్దిరామయ్య, గోపాలకృష్ణకు సర్వే నెంబరు 124/1లో ఐదెకరాల భూమి ఉంది. ఈ భూమిని ఇటీవల కోటేశ్వరరావు తన కుమారులకు రెండెకరాల చొప్పున ఇచ్చి ఎకరం భూమిని తన పేరిట ఉంచుకున్నాడు. ఈ వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని ఐదారు నెలలుగా కుమారులిద్దరితో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగాడు. నాలుగు నెలల పాటు తహసీల్దార్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవటంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను (ఆర్ఐ) సంప్రదించారు. రూ.7 లక్షలు ఇస్తే భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, ఈ నగదులో తనకు రూ.2 లక్షలు, తహసీల్దార్‌కు రూ.5 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని ఆర్ఐ బేరం పెట్టాడు. దీంతో రూ.6 లక్షల ఐదువేలను నగదు రూపంలోనూ, మరో రూ.95 వేలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సూచించిన ఫోన్ పేకు పంపారు. 2023, నవంబరు 7న ఈ నగదును చెల్లించగా, రెండు రోజుల అనంతరం 'ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు జరిగింది' చూసుకోమని ఆర్ఐ చెప్పాడు. దీంతో గోపాలకృష్ణ, మద్దిరామయ్య సచివాలయానికి వెళ్లి ఆర్‌వోఆర్ కాపీలను తీసుకున్నారు. ఇద్దరి పేరున రెండేసి ఎకరాల చొప్పున, తండ్రి పేరున ఎకరం భూమి ఉన్నట్టుగా వచ్చింది. 2023, డిసెంబరు 14వ తేదీన వీరు మళ్లీ ఆన్‌లైన్‌లో పరిశీలించగా, మద్దిరామయ్య పేరున ఉండాల్సిన రెండెకరాల భూమికి బదులుగా 86 సెంట్లు ఉన్నట్టుగా చూపారు. మిగతా పొలాన్ని మరో ముగ్గురి పేరు మీద పెట్టారు. దీంతో అన్నదమ్ములిద్దరూ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఈ అంశంపై ప్రశ్నించారు. 'రూ.7 లక్షలు నగదు తీసుకుని కూడా ఇంత అన్యాయం చేస్తారా..' అని వాదనకు దిగారు. రెవెన్యూ రికార్డుల్లో సరి చేస్తామని, విషయం బయటకు రానివ్వద్దని అధికారులు వారిద్దరికీ సర్దిచెప్పారు. తమకు జరిగిన అన్యాయంపై ఇటీవల మద్దిరామయ్య, గోపాలకృష్ణ స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు వారి వద్దకు వెళ్లి తెల్లకాగితంపై సంతకం చేస్తే అడంగల్‌లో మీ పేర్లు మారుస్తామని బెదిరింపులకు దిగారు. రెవెన్యూ అధికారుల వేధింపులు అధికం కావటంతో తమకు జరిగిన అన్యాయంపై స్పందనలో మళ్లీ ఫిర్యాదు చేశారు. అకారణంగా తమ భూమిని వేరే వారి పేరున మార్చివేశారని బాధిత రైతులు కలెక్టర్ వద్ద వాపోయారు. తమ వద్ద నగదు తీసుకోవటమే కాకుండా, మూడు రోజుల వ్యవధిలోనే పేర్లు మార్చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

డ్రెయినేజీ భూమి ఆక్రమణ

గన్నవరం మండలం సూరంపల్లిలో రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చేసిన విషయంపై స్పందనలో ఫిర్యాదు అందగా, అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెంలో ఆర్ఎస్ నెంబరు 475లో 2.56 ఎకరాల డ్రెయినేజీ భూమిని ఒక టీచర్ ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా అక్కడి రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని డొక్కా నాగమల్లేశ్వరరావు అనే రైతు మరో ఫిర్యాదు చేశారు. డ్రెయినేజీ భూమితో పాటు తమకు చెందిన 44 సెంట్ల భూమిని కూడా ఆక్రమించేశాడని, ఈ అంశంపైనా పూర్తిస్థాయి విచారణ చేయాలని కోరారు.

ఎస్పీగా ఆద్నాన్ నయీం అస్మీ

జాషువా చిత్తూరు జిల్లాకు బదిలీ



మచిలీపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ఎస్పీగా ఆద్నాన్ నయీం అస్మీ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 2013, ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన, ప్రస్తుతం ఏసీబీ ఎస్పీగా పనిచేస్తున్న అస్మీని కృష్ణా ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2016 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన, ఇప్పటివరకు కృష్ణా ఎస్పీగా పనిచేస్తున్న పి.జాషువాను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

గాంధీపై ఆధిపత్యానికి తెర

ఆరు దశాబ్దాలుగా ఒకే కుటుంబ పాలనలో బ్యాంకు

- చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన ఏడుగురు డైరెక్టర్లు
- నెగ్గాలంటే ఎనిమిది మంది ఓటేయాలి
- తమకు తొమ్మిది మంది మద్దతు ఉందంటున్న వ్యతిరేక కూటమి
- ఫిబ్రవరి 12న అవిశ్వాసం లాంఛనమే..

- 6లో..


కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

సీఆర్‌జెడ్ భూముల్లో మట్టి దోచేస్తున్నారు!

కొల్లు రవీంద్ర ధ్వజం .. చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

మచిలీపట్నం టౌన్, జనవరి 29 : ఎమ్మెల్యే పేర్ని నాని ప్రోద్బలంతో మచిలీపట్నంలో సముద్రం వెంట ఉన్న బుసక తవ్వి అక్రమంగా అమ్ముకుంటున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రవీంద్ర మీడియాతో మాట్లాడారు. సీఆర్‌జెడ్ పరిధిలో మంగినపూడి పంచాయతీ పరిధిలోని విలువైన మట్టిని పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు తవ్వుకు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తవ్వకాల కారణంగా సముద్రం ఆటుపోటులకు తీర ప్రాంతాల్లోని భూములు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. టైటానియం లాంటి ఖనిజ పదార్థాలున్న ఈ ఇసుకను పెద్ద మొత్తంలో అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మడుగుపోరంబోకు కుమ్మరిగూడెంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఎలా ఇస్తారన్నారు. కోర్టులో ఉన్న ఈ భూములకు పట్టాలు ఎలా ఇస్తున్నారన్నారని రవీంద్ర ప్రశ్నించారు. ఉల్లింగిపాలెంలో గుమ్మటాలమ్మ చెరువును పూడ్చి ఇళ్ల స్థలాలకింద వైసీపీ నాయకులు అమ్ముకుంటున్నారని, ఈ అక్రమాలపై ఫిర్యాదు చేస్తే ఆర్డీవో వచ్చి ఆక్రమిత షెడ్డులు కొన్నింటిని తొలగించారని, మిగిలినవి అలాగే ఉన్నాయన్నారు. కలెక్టరు అక్కడ బోర్డు పెట్టమని అధికారులకు చెప్పినా రాజకీయ ఒత్తిడితో అమలు కాలేదన్నారు. పెద్ద ఎత్తున తీర ప్రాంతాల్లోని మట్టిని అమ్ముకుంటున్నారని, దీనిపై విచారణ జరిపించాలని రవీంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ముసుగులో పేర్ని నాని అవినీతిని వదిలిపెట్టేది లేదన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మండల, నగర పార్టీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో ఆటలా : దేవినేని ఉమా


ఫిల్టర్ బెడ్ వద్ద నిల్వ ఉన్న బూడిద నీళ్లను చూపుతున్న మాజీమంత్రి ఉమా

ఇబ్రహీంపట్నం : వైసీపీ ప్రజా ప్రతినిధులు ప్రజారోగ్యంతో ఆటలాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. కొండపల్లి మున్సిపాలిటీలో ఇబ్రహీంపట్నం వాటర్ హెడ్ వర్క్స్ వద్ద బూడిద కలిసే ప్రాంతాన్ని టీడీపీ కౌన్సిలర్స్ పార్టీ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఎంపీ కేశినేని నాని, మంత్రి జోగి, ఎమ్మెల్యే వసంతపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బూడిద రవాణాతో వైసీపీ దొంగలు యథేచ్ఛగా కోట్లు దోచేస్తున్నారన్నారు. పది రోజులుగా ఎన్టీటీపీఎస్ సీఈకి వినతిపత్రాలు ఇచ్చినా, తాగునీరు కలుషితంపై ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎన్టీటీపీఎస్ యాజమాన్యం వైసీపీ నాయకులకు దాసోహమయ్యారని ఆరోపించారు. కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండల గ్రామాల్లో పరిశుభ్రమైన నీరు వచ్చేవరకు ఆందోళన చేస్తామన్నారు. బూడిద దోపిడీ ఆగే వరకు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో రామినేని రాజశేఖర్ (రాజ), చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణరావు, షైల సైదులు, కరమికొండ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కేశినేని నానిది అతి విశ్వాసం!

సౌమ్యను టార్గెట్ చేయడంపై నందిగామ ప్రజలు గరం.. గరం

నందిగామ : మితిమీరిన ఆత్మస్తుతి, అతి ఆత్మవిశ్వాసం, స్వీయ ప్రకటిత జాతీయ స్థాయి నాయకుడు అంటూ ఎంపీ కేశినేని నానిపై నియోజకవర్గ ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ జెండా నీడలో రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన కేశినేని ఇటీవల వైసీపీలో చేరిన విషయం విదితమే. ఈక్రమంలో నందిగామలో తొలిసారిగా వైసీపీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేశినేని ప్రసంగం కేడర్‌ను ఆకట్టుకోలేక పోయింది. నాని వెంట ఒక్క టీడీపీ కార్యకర్త అనుసరించకపోయినా టీడీపీని ఖాళీ చేస్తానంటూ చెప్పడం.. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను టార్గెట్ చేసి మాట్లాడటం చర్చనీయాంశమైంది. గత ఎన్నికల సమయంలో పలు సభల్లో నిబద్ధత, వినయం, అభివృద్ధికి సౌమ్య చిరునామా అని ఆకాశానికెత్తి ఇపుడు ఇలా మాట్లాడటమేంటని ప్రశ్నిస్తున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు నందిగామకు ఏమీ చేయలేదంటూ ఎంపీ చేసిన వ్యాఖ్యలపైనా వైసీపీ నేతలు పెదవి విరుస్తున్నారు. ఉమా హయాంలో నియోజకవర్గంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు రాష్ట్రంలో ఎక్కడా లేదన్నది సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. రెండు పర్యాయాలు ఎంపీగా గెలిపించిన చంద్రబాబుకు విధేయత చూపలేని కేశినేని కేశినేనికి సౌమ్యను విమర్శించే హక్కు లేదని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. అందరినీ నిందిస్తూ తానొక్కడే నిజాయితీ పరుడినని ఎంపీ కేశినేని ఆత్మస్తుతితో ముందుకు సాగడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు.

అన్ని విషయాలపై త్వరలో స్పందిస్తా.. : వసంత

జి.కొండూరు : త్వరలోనే అన్ని విషయాలపై మీడియా సమావేశంలో సమాధానం చెబుతానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. గడ్డమణుగు గ్రామంలో సచివాలయ భవనం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఉండాలి.. కానీ కేవలం సంక్షేమం అనే కన్ను మాత్రమే పని చేస్తున్నదని.. అందువల్ల ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అంతగా అభివృద్ధి చేయలేకపోయానన్నారు. సంక్షేమంతో ప్రజలు పూర్తిగా సంతృప్తి చెందడం లేదని.. సమస్యలపై ప్రజలు గడపగడపకు వెళ్లినపుడు ప్రశ్నించారన్నారు. క్యాడర్‌కు సీఎం జగన్ స్పష్టత ఇస్తారన్నారు. టీడీపీ తరపున పోటీ చేస్తున్నారా అన్న ప్రశ్నకు అలాంటిదేం లేదన్నారు. ఇప్పటి వరకు పార్టీ మార్పుపైన గానీ, ఇతర పార్టీలతో సంప్రదింపులు గానీ చేయలేదన్నారు. అన్ని విషయాలపై ఫిబ్రవరి మొదటి వారంలో మీడియా సమక్షంలో మాట్లాడతానని చెప్పారు.


నందివాడ పర్యటనలో రాము, రావి, పిన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు

నానీ.. ఈ రోడ్ల వైపు కన్నెత్తి చూశావా?

ఎమ్మెల్యే కొడాలిపై వెనిగండ్ల ఎద్దేవా

నందివాడ, జనవరి 29 : మండలంలో ఎప్పుడైనా ఈ రోడ్లను చూశారా? మన ఎమ్మెల్యే కొడాలి నాని.. అని వెనిగండ్ల రాము ఎద్దేవా చేశారు. నాలుగున్నరేళ్లలో మంత్రి గానీ, ఎమ్మెల్యేగా కానీ ఒక్కసారైనా రోడ్లవైపు కన్నెత్తి చూశారా.. అంటూ సోమవారం నందివాడ గ్రామంలో 'భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ, నందివాడలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, మన ఎమ్మెల్యే నాని మండలాన్ని ఒక్కసారి కూడా చూడలేదని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉండి కూడా ప్రజల సమస్యలు పట్టించుకోవటం లేదన్నారు. టీడీపీ ఇంచార్జ్‌గా సాధ్యమైనంత వరకు గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో గ్రామాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయేది తెలుగుదేశం పార్టీయేనని, ప్రజలంతా ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, తెలుగు మహిళలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీపై ఆధిపత్యానికి తెర!

- ఆరు దశాబ్దాలుగా కుటుంబపాలనలో బ్యాంకు
- చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన ఏడుగురు డైరెక్టర్లు
- అవిశ్వాసం నెగ్గాలంటే ఎనిమిది మంది ఓటేయాలి
- తొమ్మిది మంది మద్దతు ఉంది : చైర్మన్ వ్యతిరేక కూటమి
- ఫిబ్రవరి 12న అవిశ్వాసం లాంఛనమేనా!



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకుపై ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న కుటుంబ పాలనకు తెర దించేందుకు జోరుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. బ్యాంకులో అక్రమాలపై దృష్టి సారించిన డైరెక్టర్లు, బ్యాంకు మనుగడ కోసం చైర్మన్‌ను గద్దె దించాలని నిర్ణయించారు. ఈమేరకు సుదీర్ఘకాలంపాటు బ్యాంకు డైరెక్టర్లుగా కొనసాగుతున్న ఏకే అన్సారీ, సగ్గుర్తి నాగేశ్వరరావు తదితరులు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. ఈమేరకు కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయడం, ఆయన ఫిబ్రవరి 12న సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్నారు.

విజయవాడలోని గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు 1928లో ఏర్పడింది. ఈ బ్యాంకు క్రమేణా అభివృద్ధి చెందుతూ జిల్లాతోపాటు పొరుగు జిలాలోనూ ప్రస్తుతం కార్యకలాపాలను నిర్వహిస్తోంది. వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ బ్యాంకు ప్రతిష్ఠ క్రమేణా మసకబారుతూ వస్తోంది. పాలన గాడి తప్పడంతో బ్యాంకు నష్టాల బాట పట్టింది. బ్యాంకు చైర్మన్‌గా వేమూరి బసవకుటుంబరావు అలియాస్ చిట్టియ్య ఉన్నంత వరకు బ్యాంకు ఓ వెలుగు వెలిగింది. ఆ తర్వాత ఆయన వారసుడిగా బాధ్యతలు చేపట్టిన వేమూరి వెంకట్రావు అలియాస్ చిన్ని సారథ్యంలో బ్యాంకు ప్రతిష్ఠ క్రమేణా తగ్గుతూ వచ్చింది.

చిచ్చుపెట్టిన కొత్త శాఖ ఏర్పాటు

గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకుకు ప్రస్తుతం 12 శాఖలున్నాయి. విశాఖపట్నం గాజువాకలో కొత్త శాఖ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ప్రస్తుతం బ్యాంకులో అలజడికి కారణమైంది. కొత్త శాఖ ఏర్పాటుకు డైరెక్టర్ల ఆమోదం లేకుండానే చైర్మన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని సుమారు రూ.40 లక్షల వరకు ఖర్చు పెట్టడం డైరెక్టర్ల అసంతృప్తికి కారణమైంది. కొత్త శాఖ ఏర్పాటు ప్రక్రియలో చైర్మన్ నిబంధనలను తుంగలో తొక్కారని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. 2023 నవంబరులో చెల్లింపులు జరిపేసి 2024 జనవరి 4న తాపీగా బ్యాంకు శాఖ ఏర్పాటు చేయాల్సిన ఇంటి యజమానితో ఒప్పందం చేసుకోవడంపై డైరెక్టర్లు అనుమానాలు వ్యక్తం చేశారు. మరోవైపు హనుమాన్‌జంక్షన్‌లో బ్యాంకు సొంత భవన నిర్మాణం కోసమంటూ 400 గజాలు కొనుగోలు చేయడంలోనూ చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరించడం డైరెక్టర్లలో అసంతృప్తికి దారితీసింది. నూజివీడులో మరో స్థలాన్ని కూడా ఇదే తరహాలో కొనుగోలు చేశారు. ఈ స్థలాల కొనుగోలులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. తక్కువ ధరకు స్థలాలు కొనుగోలు చేసి ఎక్కువ ధర చూపించి బ్యాంకు సొమ్మును కాజేశారని డైరెక్టర్లు సహకార శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరగకుండా చైర్మన్ తన అధికారబలాన్ని ఉపయోగిస్తున్నారని డైరెక్టర్లు పేర్కొంటున్నారు.

మా వైపు 9 మంది డైరెక్టర్లు ఉన్నారు

గాంధీ బ్యాంకు చైర్మన్ ఏకపక్ష పోకడల కారణంగా ఖాతాదారులు బ్యాంకుపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని బ్యాంకు ప్రతిష్ఠ మసకబారకుండా ఉండటానికే తాము చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టామని అవిశ్వాసం ప్రతిపాదించిన ఏడుగురు డైరెక్టర్లు తెలిపారు. చైర్మన్‌తో కలిసి మొత్తం 12 మంది డైరక్టర్లు ఉన్నారని, వారిలో ఎనిమిది మంది ఓటేస్తే అవిశ్వాసం నెగ్గుతుందని, తమకు 9 మంది డైరెక్టర్ల మద్దతు ఉందని వారు పేర్కొన్నారు. ఫిబ్రవరి 12న అవిశ్వాసం లాంఛనమేనని, త్వరలో బ్యాంకుకు కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటామన్నారు.

జలగండం!



- కృష్ణా నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు
- సరదాగా దిగి సమాధి అవుతున్న యువత
- యనమలకుదురు ప్రాంతంలో అనధికార తవ్వకాలు
- ఏడాది కాలంలో 11 మంది జలసమాధి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఒకరు, ఇద్దరు కాదు.. మొత్తం 11 మందిని కృష్ణా నదిలో ఉన్న గోతులు మింగేశాయి. వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. భవిష్యత్తు దీపాలను ఆర్పేశాయి. ప్రతి ఏడాది కృష్ణా నదిలో ఈతకు దిగిన వారిలో పలువురు జలసమాధి అయిపోతున్నారు. కన్నవారికి పుట్టెడు శోకాన్ని మిగుల్చుతున్నారు. పెనమలూరు మండలం యనమలకుదురు నుంచి చోడవరంలో ఉన్న ఇసుక క్వారీ వరకు ఉన్న ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. సరదాగా ఈతకు దిగితే ప్రాణం బలి ఇచ్చుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి ఏడాది ఈ నదీ ప్రాంతంలోకి వచ్చిన యువకులు, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదాలను అరికట్టే మార్గాలను అన్వేషించడం లేదు.

● ఇష్టానుసారంగా తవ్వకాలు

కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీకి దిగువన ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పెనమలూరు మండలం చోడవరం వద్ద ఇసుక క్వారీ ఉంది. ఇక్కడి నుంచి నిత్యం టన్నుల కొద్దీ ఇసుకను తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇది కాకుండా యనమలకుదురు శివాలయానికి ఎదురుగా ఉన్న నదీ ప్రాంతంలో అనధికారికంగా తవ్వకాలు సాగుతున్నాయి. అర్ధరాత్రి రెండు గంటల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వుతున్నారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో ఇసుకను డంపింగ్ ప్రదేశాలకు తరలిస్తున్నారు. రాజకీయ నేతల వద్ద ఉండే ద్వితీయ శ్రేణి అనుచరుల కనుసన్నల్లో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నారు. శివాలయం ఎదురుగా ఉన్న పెట్రోలుబంకు పక్క నుంచి నదిలో మార్గం ఉంది. ఈ మార్గం గుండా నది మధ్యకు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు వెళ్తున్నాయి. సరిగ్గా నది మధ్యలో ఇసుకను తవ్వేస్తున్నారు. గోతుల నుంచి నీరు ఊరినప్పుడు మరోచోట తవ్వకాలు చేస్తున్నారు. ఇలా నది స్వరూపాన్ని మొత్తం చిత్తుచిత్తుగా మార్చేస్తున్నారు. గోతులమయంగా తయారు చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి దిగువన తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ వెనుక వైపున ఉన్న ప్రాంతంలో కొన్ని పాయల్లో నీరు ఉంటుంది. ఇక్కడికి తాడేపల్లి, కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాలకు చెందిన వారు వాకింగ్‌కు వెళ్తారు. కొంతమంది ఇక్కడే ఉన్న పాయల్లో ఈత కొడతారు. పటమట, దర్శిపేట, పెనమలూరు మండలం సనత్‌నగర్, యనమలకుదురు ప్రాంతాలకు చెందిన యువకులు మాత్రం ఈత కొట్టడానికి యనమలకుదురు, చోడవరం ప్రాంతాలకు వెళ్తారు. ఇక్కడ నదీ గర్భం నుంచి నీరు ఎప్పటికప్పుడు ఊరుతూ స్వచ్ఛంగా ఉంటుంది. ఈ ప్రాంతాన్ని దాటుకుని గుంటూరు జిల్లా వైపున ఉన్న నదీ పరీవాహక ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉంటుంది. ప్రాంతమంతా విశాలంగా ఉంటుంది. ఇక్కడ వాతావరణం ప్రశాంతంగా ఉండటంతో యువకులు ఈ ప్రాంతానికి వెళ్తున్నారు. ఇక్కడ కొంతమంది మత్స్యకారులు చేపల వేట సాగిస్తుంటారు. ఈత కొట్టడానికి వచ్చే యువకులు నీటి లోతును అంచనా వేయడం లేదు. గోతుల్లో మునిగి విగతజీవులుగా పైకి తేలుతున్నారు.

● నీటి మరణాలు ఆపడం ఎలా?

నది మొత్తం జలవనరుల శాఖ పరిధిలో ఉంటుంది. అందులో జరిగే ఇసుక తవ్వకాలు మాత్రం భూగర్భ గనుల శాఖ పరిధిలో ఉంటాయి. తవ్వకాలకు కాంట్రాక్టర్లకు అనుమతులు ఇస్తున్న భూగర్భ గనుల శాఖ జరుగుతున్న ప్రమాదాల గురించి ఆలోచించిన దాఖలాలు కనిపించడం లేదు. జలవనరుల శాఖదీ ఇదే తీరు. చోడవరం వద్ద అధికారికంగా నిర్వహిస్తున్న క్వారీ వద్ద సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ఒక టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసుకుని నదిలోకి ఎవరూ ఈతకు వెళ్లకుండా చేయడం వల్ల కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. ఇక యనమలకుదురు శివాలయం ఎదురుగా ఉన్న నదిలోకి ఉన్న మార్గాన్ని రిటైనింగ్ వాల్ నిర్మించి మూసివేస్తే లోపలకు యువకులకు బ్రేక్ వేయవచ్చు. నదిలోనే యనమలకుదురు పంచాయతీ అధికారులు చెత్తను డంపింగ్ చేయిస్తున్నారు. పంచాయతీ అధికారులు అయినా ఈ మార్గంలో ఒక ప్రైవేటు సెక్యూరిటీ నియమించి నదిలోకి ఎవరినీ అనుమతించకుండా చేస్తే జలసమాధులకు అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముందుగా పంచాయతీ, జలవనరులు, భూగర్భ గనుల శాఖలు సమన్వయంతో ప్రణాళికలను రూపొందించడానికి పూనుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి29(ఆంధ్రజ్యోతి) : స్పందన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో పి.రోజా, జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేస్తే సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు దూరప్రాంతాలనుంచి వచ్చి అర్జీలు అందజేస్తున్నారన్నారు. వారి నమ్మకం వమ్ముకాకుండా చూడాలన్నారు.



కులగణనను పూర్తిచేయండి

జిల్లాలో కులగణన కార్యక్రమాన్ని మంగళవారం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు 85.94శాతం మేర కులగణన పూర్తయిందని, మంగళవారం నాటికి ఈ సర్వేను పూర్తిచేయాలన్నారు. మచిలీపట్నం, తాడిగడప. పెడన ప్రాంతాలలో కులగణన సర్వే తక్కువగా జరిగిందని, వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.

ఫిబ్రవరి 5న నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన

మచిలీపట్నం మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వైద్యశాఖ అధికారులతో సోమవారం కలెక్టర్ తన చాంబరులో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 5వ తేదీన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖా మంత్రి మన్సుక్ మాండవీయ వర్చువల్‌గా నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మచిలీపట్నంలోని ప్రభుత్వాసుపత్రికి సమీపంలో నర్సింగ్ కళాశాలను నిర్మాణం చేస్తామన్నారు. కళాశాల శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆశాలత, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం జాయింట్ డైరెక్టర్ వీవీ రామన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లాలోని పోలింగ్ స్టేషన్‌ల వద్ద వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. సోమవారం అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఈఆర్వోలతో జూమ్‌పద్ధతిలో సమావేశం నిర్వహించారు. ఏ పోలింగ్ బూత్‌పరిధిలో ఎంతమంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారో ముందస్తుగానే గుర్తించాలన్నారు. ఇంటివద్ద నుంచే ఓటుహక్కును వినియోగించుకుంటారో తెలుసుకుని, నివేదికను రూపొందించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వేచి ఉండకుండా త్వరితగతిన ఓటు వేయిస్తామని తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఎన్నికల విభాగం తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 29 : స్పందన అర్జీలు వ్యక్తిగత సమస్యలుగా భావించి తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో 151 అర్జీలను స్వీకరించడం జరిగిందని, అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలకు ఆయా శాఖల అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ఎం.రజిని కుమారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..

కృష్ణలంక : ముందుగా గుర్తించి వైద్యం అందించడం ద్వారా కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేయి చేయి కలుపుదామని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. 'స్పర్శ' కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, కుష్టు నివారణకు ప్రభుత్వం అవసరమైన అన్నిచర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాధి లక్షణాలు వున్న రోగులను గుర్తించి సకాలంలో వైద్యం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చన్నారు. వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించేందుకు జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిణి జె.ఉషారాణి , పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ఎం.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఆర్థిక భరోసా లక్ష్యం

కృష్ణలంక : మత్స్య సంపదకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు వినియోగదారులకు తాజా ఉత్పత్తులను అందించి మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా జిల్లా మత్స్యశాఖ అధ్వర్యంలో సింగ్‌నగర్‌కు చెందిన యు.కమలేష్‌కు రూ.27 లక్షల విలువైన వాహనం, ఇబ్రహీంపట్నంకు చెందిన ఎస్.మాధవవర్మకు రూ.13.50 లక్షల విలువైన ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను కలెక్టర్ ఢిల్లీరావు లబ్ధిదారులకు అందజేశారు. సబ్సిడీపై ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను మంజూరు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరక్టర్ వి.పెద్దిబాబు, అసిస్టెంట్ డైరక్టర్ చక్రాణి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి పి.అఖిల వున్నారు.


అనుమతుల్లేకుండా ఏర్పాటు చేస్తున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం

నిబంధనలకు విరుద్ధంగా వైఎస్ విగ్రహ ఏర్పాటు

స్పందనలో టీడీపీ నేత ఫిర్యాదు

నందిగామ రూరల్, జనవరి 29 : కొండూరు గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎన్టీఆర్, రాజీవ్ గాంధీ విగ్రహాల మధ్యన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు సోమవారం స్పందనలో వినతిపత్రం అందజేశారు. గతంలో ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ విగ్రహాలు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేశారని, రాష్ట్ర ప్రభుత్వం 2013లో ఆర్ అండ్‌బీ శాఖ జీవో ననుసరించి కలెక్టర్ అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుపై ఎంపీడీవో, రెవెన్యూ శాఖాధికారులకు వినతిపత్రం అందజేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇటువంటి ఘటనల వల్ల శాంతిభద్రతలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని, విగ్రహం ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అయోధ్యలో నాట్య ప్రదర్శన

రామలింగ శాస్త్రికి ఆహ్వానం

కూచిపూడి, జనవరి 29 : అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్రంలో ఫిబ్రవరి 1వ తేదీన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి తన బృందంతో నాట్య ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందినట్టు తెలిపారు. శ్రీరామ్ రాగసేవ కార్యక్రమంలో భాగంగా 1వ తేదీన రామాయణం నృత్య నాటకం, ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలకు సంబంధించి వెస్త నృత్యాంశాలు ప్రదర్శించనున్నట్టు రామలింగశాస్త్రి తెలిపారు.

ఎన్నికల విధుల నుంచి జయచంద్రను తప్పించండి

ఈసీకి శ్రీరాం తాతయ్య ఫిర్యాదు

జగ్గయ్యపేట : జిల్లా పంచాయతీ అధికారి జయచంద్రను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని మాజీ ఎమ్మెల్యే, జాతీయ తెలుగుదేశం కోశాధికారి శ్రీరాం తాతయ్య ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన గత 14సం.లుగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎంపీడీవోగా పనిచేశారని, అధికార పార్టీకి అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో ప్రసంగాలు, పోస్టింగులు పెట్టారని, జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో ఓటరుగా నమోదై ఉన్నాడని పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారిగా ఆయనున్న నియమించటం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. జగ్గయ్యపేట సోషల్ మీడియా గ్రూపుల్లో ఆయన పెట్టిన పలు పోస్టింగులు, చర్చల్లో పెట్టిన సందేశాల ప్రతులను ఎన్నికల కమిషన్‌కు అందజేశారు.

కానరాని సామాజిక సాధికారత!

ఆసరా సభలో ప్రొటోకాల్ పాటించని అధికారులు


వేదిక కిందే సర్పంచ్..

కోడూరు : కోడూరు టీటీడీ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైసీపీ సామాజిక సాధికారత పూర్తిగా కరువైంది. స్థానిక అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవటంతో ప్రజలచే ఎన్నుకోబడిన గ్రామ ప్రథమ పౌరుడు స్టేజి కిందే ఉండిపోగా, పార్టీ పదవులు ఉన్న వారిని మాత్రం స్టేజీ పైకి ఆహ్వానించటంతో అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. డ్వాక్రా మహిళలను బలవంతంగా రప్పించి మహిళా సమైఖ్య సిబ్బంది వారిని బయటకు వెళ్లకుండా చుట్టూ కాపలాగా నిలిచారు.

నా కుర్చీ ఎక్కడో చెప్పండి!

గుర్విందపల్లి సర్పంచ్ ఆగ్రహం


మాట్లాడుతున్న సర్పంచ్..

తోట్లవల్లూరు: సర్పంచ్‌గా నా కుర్చీ ఎక్కడో చెప్పండి? గ్రామ పంచాయతీ భవనాన్ని గత టీడీపీ ప్రభుత్వం శ్లాబు వరకు నిర్మించి ఇస్తే ఈ ఐదేళ్లలో మన ప్రభుత్వం ఒక్క చిన్నపని కూడా చేయలేకపోయిందని, రేపు ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని గుర్విందపల్లి వైసీపీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయ భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అధికారపార్టీ సర్పంచ్ ఉదయభాస్కర్ అధికార పక్షానికి షాక్ ఇచ్చారు. పంచాయతీ భవనం లేక ఎక్కడ కూర్చోవాలో తెలియకుండా ఉందని కుర్చీ ఎక్కడో చెప్పాలని సర్పంచ్ నిలదీశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	121, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

టీడీపీ నాయకులపై దాడి హేయమైన చర్య: తుమ్మలపల్లి

కంకిపాడు, జనవరి 29 : టీడీపీ నాయకులపై అధికార పార్టీ నాయకుల దాడి హేయమైన చర్య అని టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసీపీ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రత్యర్థులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణపై రాళ్ల దాడులకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో కంకిపాడు మండల పార్టీ కార్యాలయ బాధ్యుడు బొప్పూడి శివరామకృష్ణ, పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

మొండిగోడలతో సరి!

- గన్నవరం మండలంలో ఐదేళ్లుగా సాగుతున్న సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు
- బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు




మొండిగోడలతో దర్శనమిస్తున్న ముస్తాబాద గ్రామ సచివాలయం, పునాదుల దశలో నిలిచిపోయిన వీరపనేనిగూడెం రైతు భరోసా కేంద్రం

గన్నవరం, జనవరి 29 : 'ప్రజల ముంగిటకే పాలన తెచ్చాం, అనుమతుల కోసం సుదూర ప్రాంతాలకూ వెళ్లాల్సిన అవసరమూ లేదు, చివరకు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఏ రైతు కష్టపడనక్కర్లేదు, గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగంగా ఇవన్నీ అందుబాటులో ఉన్నాయి.' ఇవి ప్రభుత్వం చెప్పే మాటలు. ఇందుకోసం గ్రామ పంచాయతీలతో సంబంధం లేకుండా గ్రామ సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే), డాక్టర్ వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలకు వసతిని వనగూర్చేందుకు ప్రభుత్వ స్థలాలలో కోట్లాది రూపాయలతో భవన నిర్మాణాలను కూడా చేపట్టారు. అయితే, ఒకటి కాదు రెండు కాదు ఐదేళ్లు పూర్తికావస్తున్నా, జిల్లాలో కీలకమైన గన్నవరంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. గన్నవరం మండలంలో 23 సచివాలయాలు, 21 రైతు భరోసా కేంద్రాలు, మరో 23 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.18.77 కోట్ల నిదులను మంజూరు చేసింది. ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షల నుంచి రూ.43.6 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షల నుంచి రూ.23.94 లక్షలు, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ.17.50 లక్షల నుంచి రూ.20.80 లక్షలను కేటాయించారు. గన్నవరంలో నాలుగు సచివాలయాలుండగా, కనీసం ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తికాలేదు. ఇతర మేజర్ పంచాయతీలలోనూ ఇదే రకమైన పరిస్థితి నెలకొంది.

వడ్డీలు కట్టలేక నానా బాధలు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా భవన నిర్మాణాలను గ్రామాలలోని ద్వితీయ స్థాయి నాయకులకు అప్పగించారు. కాంట్రాక్టులు చేస్తే ఎంతో కొంత లాభం వస్తుందనే ఉద్దేశంతో కాంట్రాక్ట్ పనులలోకి దిగిన నేతలు నేడు బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు కూడా ఉన్నారు. కొద్దో గొప్పో బయట అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వీరికి, లాభం రాకపోగా, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక నానా బాధలు పడుతున్నారు. భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు సకాలంలో విడుదలకాకపోవడం, ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో పడటంతో, భవన నిర్మాణాలకు కాంట్రాక్టర్లుగా మారిన అధికార వైసీపీ నాయకులే నిర్మాణాలను ఎక్కడికక్కడే ఆపేశారు. ఫలితంగా, మండలంలోని ఏ గ్రామంలో చూసినా సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. పురుషోత్తపట్నం, సావరగూడెంలో సచివాలయాల నిర్మాణాలు మాత్రమే 95 శాతం పూర్తవ్వగా, మిగిలిన గ్రామాల్లోని మూడు రకాల భవన నిర్మాణాలు పునాదుల దశలోనూ, మొండి గోడల, స్లాబ్ దశలలో ఆగిపోయాయి.

టీడీపీ హయాంలో చేపట్టిన పనులకూ బిల్లులు చెల్లించలేదు

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు ఇప్పటికీ బిల్లుల చెల్లింపు జరగలేదు. అదే పరిస్థితి తమకు వస్తే, తామేం కావాలని గ్రామాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో తమను సీనియర్ నాయకులు సైతం పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మరో రెండు మూడు నెలలో వైసీపీ పాలన ముగియనుండగా, తమకు బిల్లులు వస్తాయో, రావోనని నేతలు ఆందోళన చెందుతున్నారు.

ధనేకులలో వ్యవసాయంలో టెక్నాలజీపై సదస్సు

పెనమలూరు, జనవరి 29 : స్థానిక ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వ్యవసాయంలో టెక్నాలజీ పాత్రపై సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న వక్తలు కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ పెరుగుతున్న టెక్నాలజీని వ్యవసాయ పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తుల తయారీకి ఉపయోగిస్తే సమాజంలో అనేక క్లిష్టమైన వ్యవసాయ పద్ధతులను మార్చవచ్చని పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తి వాహనాలు, రోబోటిక్స్ సిస్టమ్స్, డేటా అనాలిసిస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు, బయోటెక్నాలజీ, బిందుసేద్యం, సెన్సార్ ఆధారిత వ్యవస్థల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ ఠాగూర్, సెక్రటరీ ధనేకుల భవానీ ప్రసాద్, డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, డీన్లు డాక్టర్ రావి సత్యప్రసాద్, డాక్టర్ సుధీర్‌బాబు, డాక్టర్ శ్రీకాంత్, ఈసీఈ విభాగాధిపతి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

ఉయ్యూరు, జనవరి 29 : జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు చిన్నతనం నుంచి క్రమశిక్షణ, కష్టపడడం అలవాటు చేసుకోవాలని రక్ష ఫౌండేషన్ డైరెక్టర్ పడమట స్నిగ్ధ అన్నారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్‌లో అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్షా ఫౌండేషన్ ద్వారా సమాజంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ప్రతి రోజు వారికి అల్పాహారం అందిస్తామన్నారు. ఫౌండేషన్ చైర్మన్ పడమట సురేశ్‌బాబు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అభినందన

ఉయ్యూరు, జనవరి 29 : ఏపీ సీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్‌లో ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసాపత్రాలు పొందిన ఉద్యోగులను ఏఈ కృష్ణనాయక్ అభినందించారు. గణతంత్ర దినోత్సవం రోజున విజయవాడ సర్కిల్ కార్యాలయంలో ఉత్తమ ఉద్యోగులుగా పురస్కారం అందుకున్న జేఏఓ వర్మ, జేఈ రాజేంద్రకుమార్, జేఏ అనూషలను సోమవారం కృష్ణనాయక్ అభినందించారు.

బావ వేధింపులపై ఫిర్యాదు

పెనమలూరు, జనవరి 29 : భర్త పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మరదలు తనతో అక్రమ సంబంధానికి ఒప్పుకోలేదనే కారణంతో ఆమెకు రావాల్సిన ఆస్తిపై కన్నేసి వేధింపులకు గురిచేస్తున్న బావపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు భగత్‌సింగ్ కాలనీకి చెందిన మహిళ భర్త పదేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోయాడు. తర్వాత అత్తమామలు రెండేళ్ల వ్యవధిలో చనిపోయారు. అత్తమామలకు చెందిన ఒక పోర్షన్లో ఆమె కుమార్తెతో ఉంటుంది. మరో పోర్షన్లో తన బావ ఎదురుపాక వెంకట శివ పద్మ శ్రీనివాస్ తన కుటుంబంతో నివాసముంటున్నాడు. తన భర్త చనిపోయిన సమయం నుంచి తనతో అక్రమ సంబంధం నెరపాల్సిదిగా ఒత్తిడి చేస్తున్నాడని, దానికి ఒప్పుకొనక పోయేసరికి తాను నివాసముంటున్న తన పోర్షన్‌కు నకిలీ డాక్యుమెంట్లు పుట్టించి బావ, తోడికోడలు ఇల్లు తమదని, ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా బెదిరిస్తూ భౌతిక దాడులకు దిగుతున్నారని, తనకు న్యాయం చేయాల్సిందిగా వేడుకుంటూ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

కృష్ణా కరకట్టపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటమట రామలింగేశ్వరనగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ భానుప్రకాష్ (19) గత 27న కొత్త బైకును కొని కరకట్టపై వెళుతుండగా మరో బైకును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తన కాలు విరగగా, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకొంటూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి..

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పోరంకి వందడుగుల రోడ్డులో ఒక వృద్ధుడు మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటమట రామలింగేశ్వరనగర్‌కు చెందిన బిల్లకుర్తి పాపశివ(60) వందడుగుల రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అయితే డ్యూటీ ముగించుకొని సోమవారం ద్విచక్రవాహనంపై ఉదయం ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య కాపురానికి రావడంలేదని..

భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపం చెందిన ఒక యువకుడు ఉరివేసుకొని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తాడిగడప డొంకరోడ్డులో నివాసముండే ధనుకొండ సంతోష్ (32), హైదరాబాద్‌కు చెందిన కనక దుర్గ మహతికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థల కారణంగా మహతి తన పుట్టింటికి వెళ్లిపోయి ఎంతకీ రాకపోవడంతో మనస్తాపం చెందిన సంతోష్ ఆదివారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కౌన్సిల్ సమావేశంలో రగడ

- టిడ్కో ఇళ్లకు కట్టిన సొమ్ము చెల్లింపుపై ప్రశ్నించిన టీడీపీ కౌన్సిలర్ సుధారాణి
- మూకుమ్మడిగా మాటల దాడికి దిగిన వైసీపీ కౌన్సిలర్లు
- సమావేశం మధ్యలోనే ముగించి వెళ్లిపోయిన చైర్మన్



కౌన్సిలర్ సుధారాణిపై మూకుమ్మడిగా మాటల దాడికి దిగిన వైసీపీ కౌన్సిలర్లు

ఉయ్యూరు, జనవరి 29 : టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల జాబితా నుంచి అనర్హులని తొలగించిన వారికి కట్టిన డబ్బులు ఎప్పుడు తిరిగి ఇస్తారని ప్రశ్నించిన 20వ వార్డు టీడీపీ కౌన్సిలర్ పంద్రాజు సుధారాణిపై అధికార పార్టీ వైసీపీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా మాటల దాడికి దిగడంతో కౌన్సిల్ సమావేశంలో రగడ చోటు చేసుకుంది. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఉయ్యూరులో టిడ్కో ఇళ్లపై సుధారాణి ప్రశ్నించారు. లబ్ధిదారుల పేరున బ్యాంకులో తీసుకున్న లోన్లకు సంబంధించి డబ్బుకట్టమని బ్యాంకుల వారు లబ్ధిదారులపై ఒత్తిడిచేస్తూ వారి ఖాతాలో ఉన్న డబ్బు అప్పుకింద జమవేసుకుంటున్నారని, మరికొందరిని లోనుడబ్బు కట్టమని ఒత్తిడి చేస్తున్నారని, ఇళ్లు ఇంతవరకు అప్పగించకుండా డబ్బు ఎట్లా కట్టాలని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని సుధారాణి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. లోను డబ్బులు కట్టించుకునేందుకు మరో 6 నెలలు ఆగాలని, ఇళ్లు అప్పగించే వరకు లోను డబ్బు కట్టించుకోవద్దని బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశాలిచ్చారని కమిషనర్ వివరణ ఇచ్చారు. టీడీపీ అధికారంలో ఉండగా టిడ్కో ఇళ్లు మంజూరు చేయగా రూ. 25 వేలకు పైగా డబ్బులు కట్టారని, తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు లబ్ధిదారులు అనర్హులని చెప్పి జాబితా నుంచి తొలగించి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటి వరకు వారికి డబ్బులు ఇవ్వలేదని, ఎప్పుడు తిరిగిస్తారని ప్రశ్నించారు. టిడ్కో నుంచి డబ్బు రావాలసి ఉందని కమిషనర్ తెలపడంతో మా ప్రభుత్వం వచ్చేవరకు ఇవ్వరా, వచ్చేది మా ప్రభుత్వమే అన్న సుధారాణి వ్యాఖలను అడ్డుకున్న వైసీపీ కౌన్సిలర్లు మీ పార్టీ అధికారంలోకి రానే రాదు, మరలా వచ్చేది మా ప్రభుత్వమే అని 17వ వార్డు కౌన్సిలర్ రాజులపాటి నాగేంద్రప్రసాద్ ఎదురుదాడికి దిగి బల్ల చరుస్తూ ఊగిపోయారు. దీంతో వైస్ చైర్మన్లు సోలె సురేశ్, అర్షతున్నీసా, కౌన్సిలర్లు గోన మదన్, గుంజా సుధాకర్, కూరాడ వెంకటలక్ష్మి మరి కొందరు వైసీపీ కౌన్సిలర్లు సుధారాణి, ఇతర టీడీపీ కౌన్సిలర్లపైకి దూసుకు వచ్చి వాగ్వాదానికి దిగారు. దీంతో సమావేశం ముగించుకుని చైర్మన్ బయటకు వెళ్లిపోయారు. అంతకు ముందు షాదీఖానా బోర్డులో అందరి పేర్లు వేయాలని వైసీపీ చెందిన 8వ వార్డు కౌన్సిలర్ అన్వర్‌బేగ్ ప్రస్తావించగా ఈ విషయంపై కొద్దిసేపు చర్చ జరిగింది.

సందడిగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఉంగుటూరు, జనవరి 29 : మానికొండ గోగినేని పిచ్చయ్యచౌదరి జడ్పీహైస్కూల్‌లో సోమవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1983-84లో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు 40 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులు అమరలింగేశ్వరరావు, పార్వతి, ప్రస్తుత పాఠశాల హెచ్ఎం శివరామకృష్ణలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాలకు బీరువాను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు షేక్ అజిత్, తాతారావు, పెదపూడి నాంచారయ్య, వట్టికూటి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

కారులో తరలిస్తున్న రూ.10 లక్షలు సీజ్

పెనమలూరు, జనవరి 29 : సరైన ధృవ పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ. 10 లక్షల నగదును పెనమలూరు పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మురళీనగర్ ప్రాంతంలో సోమవారం జరిపిన తనిఖీల్లో విజయవాడ మాచవరానికి చెందిన నల్లవాగుల దుర్గాప్రసాద్ వద్ద సరైన ధృవ పత్రాలు లేకుండా తరలిస్తున్న పది లక్షల నగదును స్వాధీనం చేసుకొన్నారు.

రూ. 4.25 లక్షలు స్వాధీనం



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పోలీసులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. బొమ్ములూరు వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ. 4.25 లక్షలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు జనార్దన్, తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సర్వే 92శాతం పూర్తి

హనుమాన్‌జంక్షన్, జనవరి 29 : మండలంలో నిర్వహిస్తున్న కులగణన సర్వే 92శాతం పూర్తిచేసినట్లు బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు తెలిపారు. మండలంలో 30,570 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 28,700 కుటుంబాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వే చేసి కులగణన చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా మంగళవారం హనుమాన్ జంక్షన్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటలు వరకు నిలిపివేస్తున్నట్లు సెక్షన్ ఏఈ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. బాపులపాడులోని హనుమాన్‌నగర్, వేలేరు రోడ్డు, రాజులకాలనీ, కెఎస్ టాకీస్, విజయవాడ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లుపేర్కొన్నారు.

వైభవంగా బాబా వార్షికోత్సవం

ఉంగుటూరు, జనవరి 29 : ఇందుపల్లి సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. సాయిబాబా, విఘ్నేశ్వర, దత్తాత్రేయ స్వామి వార్లకు తెల్లవారుఝాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, ఉయ్యూరు మురళీ, రాజేశ్వరి దంపతులు, కమిటీ కార్యనిర్వాహకులు వక్కలగడ్డ రామచంద్రరావు, వెంకటభువనేశ్వరీదేవి దంపతులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిపారు.

ధరల పెంపుతో పేదలపై పెనుభారం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఉయ్యూరు 11వ వార్డులో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీలో బోడె ప్రసాద్

ఉయ్యూరు, జనవరి 29 : వైసీపీ ప్రభుత్వంలో అన్ని ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపారని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీ 11వ వార్డులో సోమవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు, జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, కౌన్సిలర్లు సుధారాణి, పలియాల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు జయదేవ్, బూరెల నరేశ్, మీసాల అప్పలనాయుడు, నజీర్, మేరుగ చినకోటయ్య, కంపాటి కార్తీక్, ఆదినారాయణ, శివప్రసాద్, శ్రీనివాసరావు, ఓంకార్ పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం

కందలంపాడు (కంకిపాడు) : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్‌రామ్ అన్నారు. మండలంలోని కందలంపాడులో సోమవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొవ్వా నరేష్, సుబ్రహ్మణ్యం, వర శ్యామల, ఆంటోని, వెంకటేశ్వరరావు, అనిల్, మహేష్, కళ్యాణ్, కొండ పాల్గొన్నారు.

- జగన్నాధపురంలో సోమవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, నాదెళ్ల సత్యనారాయణ, గండికోట బాలయ్య, ఉప్పు నారాయణ, నూకల నాగార్జున, జనసేన పార్టీ నాయకులు మేకల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : జగన్మోహన రెడ్డికి త్వరలోనే అధికారం కోల్పోతాననే భయం పట్టుకుందని టీడీపీ నాయకులు వెలగపూడి శంకరబాబు, దేవినేని గౌతమ్ స్మిత దంపతులు, మొక్కపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. యనమలకుదురు, కానూరు, తాడిగడప ల్లో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో వారు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. చంద్రబాబు రా.. కదలిరా సభలకు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివస్తున్న జనాన్ని చూసి, మరో పక్క షర్మిల జగన్ నిజస్వరూపాన్ని బయట పెట్టడంతో వైసీపీ నాయకులకు భయం పట్టుకుందన్నారు. కార్యక్రమంలో శేఖర్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : వైసీపీ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీ యూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుస్సే నాగప్రసాద్, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	121, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30



చిరంజీవికి వేదవ్యాస్ అభినందనలు

మచిలీపట్నం టౌన్, జనవరి 29 : పద్మవిభూషణ్‌ను అవార్డును స్వీకరించనున్న మెగాస్టార్ చిరంజీవిని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. చిరంజీవిని హైదరాబాద్‌లో సోమవారం వేదవ్యాస్, ఆయన కుమారుడు కిరణ్‌తేజ్ కలిశారు. వేదవ్యాస్ విలేకరులతో మాట్లాడుతూ, చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ తరఫున అప్పట్లో పోటీ చేసిన సంగతి గుర్తు చేశారు. ప్రస్తుత రాజకీయాలపై చిరంజీవి చర్చించారని వేదవ్యాస్ తెలిపారు.





చల్లపల్లి జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర | గూడూరు మండలం రాయవరంలో పర్యటిస్తున్న కాగిత కృష్ణప్రసాద్ | కాపవరంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీలో వర్లకుమార్ రాజా

బీసీల ద్రోహి జగన్

• తరిమికొట్టండి...జయహో బీసీ సదస్సులో కొల్లు, మండలి పిలుపు

చల్లపల్లి, జనవరి 29 : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ముఖ్యమంత్రి జగన్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. జయహో బీసీ సదస్సు సోమవారం రాత్రి స్థానిక ఏటీఎం సెంటరులో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, జగన్ ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ఎత్తుగడలు వేస్తుంటాడని, బీసీలు ఎవరూ మోసపోవద్దని సూచించారు. బలహీనవర్గాలకు స్వాతంత్ర్యం వచ్చింది ఎన్టీఆర్ టీడీపీని స్థాపించాకే అన్నారు. వైసీపీ పాలనలో బీసీలను అణిచివేశారన్నారు. పేరుకి 56 కార్పొరేషన్‌లు పెట్టినా రూపాయి నిధులు ఇవ్వలేదనీ, సబ్‌ప్లాన్ నిధులూ ఇవ్వలేదన్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, టీడీపీ వచ్చిన తర్వాత 24 శాతం రిజర్వేషన్‌తో బీసీలకు రాజ్యాధికారం కల్పించిందని చంద్రబాబు మరో 10 శాతం పెంచి 34 శాతం రిజర్వేషన్లతో బీసీలకు మరింతగా ప్రాతినిధ్యం కల్పిస్తే, జగన్ వచ్చిన తర్వాత 10శాతం తగ్గించి 24 శాతం రిజర్వేషన్‌లతోనే ఎన్నికలు నిర్వహించారన్నారు. ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదన్నారు. . బీసీలు, ఎస్సీలపై వైసీపీ ప్రభుత్వంలో జరిగినన్ని అత్యాచారాలు, హత్య లు మరే ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఉప్పెన కంటే మిన్నగా దివిసీమలో గ్రామాలు నాశనం అయ్యాయన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో టీడీపీ రాష్ట్ర నేతలు కొనకళ్ల బుల్లయ్య, బచ్చుల సుబ్రహ్మణ్యం, బొడ్డు వేణుగోపాలరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, నేతలు పైడిపాముల కృష్ణకుమారి, మోర్ల ప్రసాద్, లుక్కా పిచ్చియ్య, ఎ.పాండురంగారావు, ఉస్మాన్ షరీఫ్, మోర్ల జయలక్ష్మి, గొరిపర్తి వెంకటేశ్వరరావు, బొల్లా ఫణి, వెంకటేశ్వరరావు, బోలెం నాగమణి, పిట్టు వెంకటేశ్వరమ్మ, రాజులపాటి అంకమ్మ తదితరులు ప్రసంగించారు. ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, యార్లగడ్డ శ్రీనివాసరావు తదితర నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ బీసీ నేతలు, కార్యకర్తలతో కలిసి పురవీధుల్లో ర్యాలీగా సభావేదికకు వచ్చారు.

అవినీతి పాలకులను సాగనంపండి

పెడన/పెడన రూరల్ : అవినీతి జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలని పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కాగిత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. గూడూరు మండలం రాయవరం గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కృష్ణప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. సాదరబోయిన పోతన స్వామి, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, కాసగాని శ్రీనివాసరావు, సిరివెళ్ల శ్రీనివాసరావు, శాయన సోమయ్య, బాసంశెట్టి శ్రీనివాసరావు, నందం శివ, భూపతి సాయిప్రకాష్ పాల్గొన్నారు.

జగన్‌కు అన్ని వర్గాల ఉసురు : వర్ల

పామర్రు : అన్ని వర్గాల ఉసురు పోసుకుంటున్న జగన్ సర్కార్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి వర్ల కుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలోని కాపవరం, సప్పాఖాన్‌పాలెం, పెరిశేపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు కార్యక్రమంలో పాల్గొని చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, ఈడే నాని, గొట్టిపాటి లక్ష్మీదాస్, మద్దా శ్రీనివాసరావు, మద్దా నిరంజన్‌రావు, కాపవరపు కుటుంబరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, జన్ను శోభన్‌బాబు, మండపాక శంకర్‌బాబు, పానుగంటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

భూహక్కు చట్టం రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 29 : భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం న్యాయవాదులు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు, ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురాం మాట్లాడుతూ, భూహక్కు చట్టం రద్దు విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాదుల గుమాస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వి. ఫణికుమార్ మాట్లాడుతూ, న్యాయవాదులు రోడ్డెక్కి మూడు నెలలుగా ఉద్యమిస్తున్నా వైసీపీ పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీరావు, పోతురాజు, జి.వి.ఎల్. నరసింహారావు, మాదివాడ వెంకట నరసింహారావు, సత్యనారాయణ, కొనకళ్ల రాధాకృష్ణ, లంకే వెంకటేశ్వరరావు, కొండయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలంటూ పెన్షనర్ల ధర్నా

మచిలీపట్నం టౌన్ : పీఆర్సీ బకాయిలు చెల్లించాలంటూ మచిలీపట్నం ధర్నా చౌక్ వద్ద ప్రభుత్వ పెన్షనర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఏపీ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామస్వామి, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.వి.ప్రసాద్ నాయకత్వం వహించారు. రామస్వామి మాట్లాడుతూ, పాత పద్ధతిలో 70 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు 10 శాతం, 75 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు 15 శాతం అదనంగా పించను పెంచాలన్నారు. జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, అన్ని వ్యాధులకు ఉచిత వైద్యం అందించాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎ గఫార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీఎస్ఆర్ ఆంజనేయులు, అవనిగడ్డ యూనిట్ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గుడివాడ సంఘం అధ్యక్షుడు భవిరి శంకరనాథ్, రాష్ట్ర ఎన్జీవోల సంఘం సంఘ వైస్ ప్రెసిడెంట్ ఆకూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, జయకర్, కంచనపల్లి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మూడో రోజుకు క్రాంతిపథం ఉద్యోగుల దీక్షలు

మచిలీపట్నం టౌన్ : సర్వీసులు క్రమబద్ధీకరించాలంటూ వైఎస్ఆర్ క్రాంతిపథం ఉద్యోగులు నిర్వహిస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న దీక్షల్లో సంఘ నాయకులు సిహెచ్. తిరుపతయ్య, ఎస్. కిషోర్‌బాబు, వై. రాజా గోవింద్, శ్రీను తదితరులు మాట్లాడారు. మూల వేతనంపై నూరు శాతం ఈపీఎఫ్ అమలు చేయాలని, పే స్కేల్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. సెర్ప్‌లో కారుణ్య నియామకాలు జరిపి మృతిచెందిన కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు.



చంద్రశేఖరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్, బంతేజీ

గొర్రెపాటి విద్యాట్రస్ట్ కోశాధికారి చంద్రశేఖరరావు మృతి

ఘంటసాల : గొర్రెపాటి విద్యా ట్రస్ట్ కోశాధికారి గొర్రెపాటి చంద్రశేఖరరావు (83) సోమవారం మృతి చెందారు. అనారోగ్యానికి గురైన చంద్రశేఖరరావు విజయవాడలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. ఎన్ఆర్ఐ రంగనాథ్ బాబు ఏర్పాటు చేసిన గొర్రెపాటి విద్యాట్రస్ట్ నిర్వహణ బాధ్యతలను చంద్రశేఖరరావు సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామ ప్రజల మన్ననలు పొందారు. చంద్రశేఖరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రశేఖరరావు భౌతికకాయాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నాయకులు తుమ్మల చౌదరిబాబు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బండి పరాత్పరరావు, అయినపూడి భాను ప్రకాష్, మిక్కిలినేని మధు, ఘంటసాల ఏఎంసీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, వైసీపీ నాయకులు వేమూరి ప్రవీణ్, దేవినేని విజయ్‌కుమార్, సీపీఎం నేత వాకా రామచంద్రరావు, విజయా అకాడమీ ప్రిన్సిపాల్ భీమారావు, బౌద్ధ భిక్షువు బంతేజీ సందర్శించి నివాళులర్పించారు.

కరాటేలో కోసూరు విద్యార్థులకు పతకాలు



కూచిపూడి : అంతర్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోసూరు సన్‌ఫ్లవర్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. కటా విభాగంలో తనుష్ రామ్, రాజులపాటి సూర్యతేజ, వలువర్తి ధనుష్ బంగారు పతకాలు సాధించారు. పెరుమూడి గౌరీనందన్, బల్లా శ్రావ్య, చిందా రోహిత్ కాంస్య సాధించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలను, కోచ్ శ్రీనివాస్‌లను జోసెఫ్ థామస్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



అవనిగడ్డ రూరల్ : అశ్వారావుపాలెం పంచాయతీ పరిధిలో కటికటల వెంకటేశ్వరరావు ఇంటి వద్ద నుంచి సనకా రాంబాబు ఇంటి వద్ద వరకు 175 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ లంకమ్మ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రోత్సాహంతో టీడీపీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర సమకూర్చిన రూ.10 లక్షల నిధులతో రోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు కటికల వసంత్, ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దాసినేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు రేపల్లె వీరరాఘవయ్య, కొండవీటి మస్తానరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గుడివాడ : పండిట్ గానాల రామమూర్తి విశ్వబ్రాహ్మణ జాతి ఔన్నత్యానికి, అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని ప్రముఖ సాహితీవేత్త రామలక్ష్మాణాచార్యులు అన్నారు. విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘం నూతన ప్రధాన కార్యదర్శిగా విశ్రాంత ఉపాధ్యాయులు పొన్నపల్లి బాలశివరామప్రసాద్ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షులు చింతలూరి సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగులు వీరరాఘవాచార్యులు, కృష్ణకిషోర్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీనుబాబు, రవి, సుధాకర్, చోడవరపు రూప. శనగపాటి నాగేశ్వరరావు, గాయత్రి మహిళా మండలి అధ్యక్షురాలు ఉమాదేవి, యలమర్తి కోటేశ్వరరావు, పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.




జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిసిన బండి రామకృష్ణ | జనసేన నేతలను కలిసి మంగళగిరి ర్యాలీకి ఆహ్వానిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేస్తాం

● జనసేన నేత బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్ : టీడీపీ, జనసేన పొత్తుతో వైసీపీని సులభంగా బంగాళాఖాతంలో కలిపేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. జనసేన పీఏసీ చైర్మన్ నాదెళ్ల మనోహర్‌ను సోమవారం కలిసిన అనంతరం ఆయన మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడారు. సీట్ల విషయంపై ఇరు పార్టీల నేతలు చర్చించుకుని నిర్ణయాలు తీసుకుంటారని, దీనిపై నాయకులు ఎవరు మాట్లాడవద్దని మనోహర్ తెలిపారన్నారు. టీడీపీ, జనసేనలతో పాటు బీజేపీని కలుపుకు వెళ్లడంపై చర్చిస్తున్నారన్నారు.

కలిసి పనిచేయండి

అవినీతి, అక్రమాల వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా జనసేన, టీడీపీ నాయకులు కలిసి పనిచేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. జనసేన నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. వైసీపీ నేతల అక్రమ మట్టి తవ్వకాలు, ఇతర దోపిడీ విధానాలను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లాలన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఉపాధ్యక్షుడు మహమ్మద్ సమీర్, నాయకులు కర్రి మహేష్, పినిశెట్టి వేణు, కంచర్లపల్లి సీతయ్య, వినయ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరుతున్నా

● భారీగా తరలిరండి : విక్కుర్తి శ్రీనివాస్

అవనిగడ్డ : ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ సోమవారం అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన జనసేన ముఖ్యనేతలను కలిశారు. ఫిబ్రవరి 1వ తేదీన తాను పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరుతున్నానని, ర్యాలీకి తరలిరావాల్సిందిగా వారిని విక్కుర్తి శ్రీనివాస్ కోరారు. జనసేన ముఖ్యనేతలు మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, రాయపూడి వేణుగోపాల్, బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, చెన్నగిరి సత్యనారాయణ తదితరులను ఆయన కలిశారు. ఫిబ్రవరి 1న భారీ ర్యాలీతో మంగళగిరి తరలివెళ్లి పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరుతున్నానని, ఈ నేపథ్యంలోనే నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నేతలను, కార్యకర్తలను కలిసినట్లు విక్కుర్తి శ్రీనివాస్ పాత్రికేయులకు తెలిపారు.

కె.కొత్తపాలెంలో కత్తులతో దాడి

● ఒకరికి తీవ్ర గాయాలు

మోపిదేవి : కె.కొత్తపాలెం గౌడపాలెంలో ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకోగా, పడమట సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి పడమట సుబ్రహ్మణ్యం అదే గ్రామానికి చెందిన వీరంకి సుబ్బారావు పరస్పరం కత్తులతో దాడి చేసుకున్నారు. సుబ్రహ్మణం తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మచిలీపట్నం తరలించినట్లు సమాచారం.

రూ.15 లక్షల నగదు సీజ్



గుడివాడ రూరల్, జనవరి 29 : వాహనాల తనిఖీ సందర్భంగా లింగవరం రోడ్డులో సోమవారం పోలుకొండ నుంచి మోటార్ బైక్‌పై వస్తున్న ఎం.గంగయ్య వద్ద ఎలాంటి ఆధారాలు చూపని రూ.15 లక్షల నగదు సీజ్ చేసినట్లు సీఐ ఏసుబాబు తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. సీజ్ చేసిన నగదును కోర్టుకు సమర్పించామన్నారు. ఎస్సై ఎన్.లక్ష్మీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లిలో వేటూరికి ఘననివాళి

మోపిదేవి : జయంతి సందర్భంగా సినీ గేయ రచయిత వేటూరి సుందరామ్మూర్తికి స్వగ్రామం పెదకళ్లేపల్లిలో ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోసూరు రామాంజనేయులు, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో వేర్వేరుగా వేటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

పరుచూరికి మండలి పరామర్శ

ఘంటసాల : టీడీపీ నాయకులు పరుచూరిసుభాష్ చంద్రబోస్‌ను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సోమవారం పరామర్శించారు. విజయవాడలో నివాసం ఉంటున్న పరుచూరి సుభాష్‌చంద్రబోస్ సోదరుడు పరుచూరి శాస్త్రులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మండలి బుద్ధప్రసాద్ సుభాష్ చంద్రబోస్‌ను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సానుభూతి తెలియజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, టీడీపీ నాయకులు దండమూడి శివనాగేశ్వరరావు, యార్లగడ్డ వీరభద్రరావు, మొవ్వ శ్రీరామ్మూర్తి, మొవ్వ కోటేశ్వరరావు (బాచి) తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు

కోడూరు : ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు రూ.10,46,69,036ను డ్వాక్రా మహిళలకు అందజేశారు. రైతు విభాగ జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీడీవో ఆర్.శ్రీనివాస్, సర్పంచ్ వెన్నా షైనీ, స్థానిక ప్రజాప్రతినిధులు, సమైక్య అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కోడూరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా లింగారెడ్డిపాలెంలో కొండూరి నాంచారమ్మకు చెందిన గృహం సోమవారం దగ్ధమైంది. తెల్లవారుజామున తన నివాసంలో నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు రావటంతో ఆమె బయటకు పరుగులు తీసింది. ఇంటితో పాటు రూ.60 వేలు నగదు, 20 గ్రాముల బంగారం అగ్నికి ఆహుతి అయినట్లు బాధితురాలు తెలిపింది.

వేకనూరులో అభివృద్ధి పనులు ప్రారంభం

అవనిగడ్డ రూరల్ : వేకనూరు గ్రామంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, మూడు సీసీ రోడ్లను ప్రారంభించారు. వైసీపీ నాయకులు కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతిదేవి, జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వర్రే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని మార్చడం అప్రజాస్వామికం : సీపీఐ

మచిలీపట్నం టౌన్ : కృత్తివెన్ను మండలం నిడమర్రు దళితవాడలోని 208 పోలింగ్ కేంద్రాన్ని గౌడపాలెంలోకి మార్చడాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య ఖండించారు. కలెక్టరేట్ వద్ద తాతయ్య మీడియాతో మాట్లాడారు. చాలా కాలంగా నిడమర్రు దళితవాడలోని ఎస్సీలకు పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉందన్నారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా గౌడపాలెంలోకి పోలింగ్ కేంద్రాన్ని మార్చడం అప్రజాస్వామికమన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, ముప్పాల యోహాన్, నరేష్, జోజిబాబు, ఫ్రాన్సిస్, ఎం. అవినాష్‌బాబు, ఎం. జోషి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెడన రూరల్ : గూడూరు మండలం తరకటూరు గ్రామంలో సీఐ బాషా నేతృత్వంలో ఎస్సై శేషకుమార్ సిబ్బందితో దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద 1,02,200 స్వాధీనం చేసుకున్నారు. చట్టవ్యతిరేక కార్యక్ర మాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బాషా హెచ్చరించారు. పెడన: మండలంలోని కూడూరు గ్రామంలో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ. 3600 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు.


సర్పంచ్‌ల నిరసన దీక్ష జయప్రదం చేయండి

మచిలీపట్నం టౌన్ : సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం మచిలీపట్నంలో మంగళవారం నిర్వహించనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం నాయకులు గల్లా తిమోతి, కాగిత గోపాలరావు విలేకరుల సమావేశంలో సోమవారం కోరారు. 16 డిమాండ్లతో సర్పంచ్‌లు నిర్వహించే నిరసన దీక్షలో రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి జిల్లాలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొంటారన్నారు.

డీవైఈవో పోస్టులు పెంచాలి : కె.ఎస్.లక్ష్మణరావు

మచిలీపట్నం టౌన్ : రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డీవైఈవో పోస్టులను పెంచాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, స్టడీ మెటీయల్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఏ. ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు లెనిన్‌బాబు, నాయకులు కీర్తి తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌తో ప్రజలందరికీ రక్షితనీరు



గుడివాడ రూరల్ : గ్రామాల్లో ప్రజలందరికీ రక్షిత నీటిని అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జల్ జీవన్ మిషన్ పనులపై సమావేశం జరిగింది. మండలంలోని ప్రతీ ప్రతి ఇంటికీ కుళాయి వేసి తాగునీరు అందించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అధికారులు, నాయకులు, ప్రజలతో కూడిన కమిటీతో జల్ జీవన్ మిషన్ పనులు చేయాలని కోరారు. కాంట్రాక్టర్లతో పని చేయించవద్దని, గ్రామ కమిటీతో పనులు చేయించాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ఎంపీడీవో అనగాని వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ బి.వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.